

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,279 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారికి సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆలయ సెక్యూరిటీ విభాగం శనివారం సారెను సమర్పించింది.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి తాడేపల్లికి చెందిన ముళ్లపూడి వెంకట సత్య భగవాన్ శనివారం రూ.1,01,116 అందజేశారు.



న్యూస్‌రీల్

ఒలింపిక్ క్రీడాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు



నరసరావుపేటఈస్ట్: పారిస్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ ఒలింపిక్–2024 క్రీడలను పురస్కరించుకుని భారత క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో శనివారం ఒలింపిక్ క్రీడల లోగోలో సెల్ఫీ దిగి క్రీడాకారులకు చీర్ ఫర్ భారత్ అంటూ ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్, క్రీడా కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ, టీసీ, విద్యార్థి పాటు తల్లిదండ్రులు ఆధార్ జిరాక్స్, విద్యార్థి ఫొటో, సెల్ నంబరు, మెయిల్ ఐడీ, చిరునామా వివరాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ప్రైవేటు నెట్ కేంద్రాలతో పాటు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 27న సర్టిఫికెట్ల, 29న కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

అధికారుల ముసుగులో టీడీపీ బరితెగింపు

- పశువుల దాణా సరఫరా చేసే ఆటోపై జులుం
- డ్రైవర్‌పై పోలీస్‌ల లాఠీతో దాడి
- అడ్డుకోబోయిన పోలీస్ సిబ్బందిపై దురుసు ప్రవర్తన



నరసరావుపేటటౌన్: మేము జీఎస్టీ అధికారులం.. వే బిల్లు చూపించండి.. లేకుంటే రూ.5 వేలు లంచం ఇవ్వండి.. చెప్పినట్టు వినకపోతే ఆటో సీజ్ చేస్తాం అంటూ అధికారుల పేరు చెప్పి టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగిన వైనమిది. వివరాల్లో కెళితే.. పట్టణానికి చెందిన నంబూరి వేణుగోపాల్‌రెడ్డి గేదెల ఫారాలకు పశువుల దాణా సరఫరా వ్యాపారం చేస్తూ ఉంటాడు. అతని వద్ద పనిచేసే ఆటో డ్రైవర్ శుక్రవారం రాత్రి పాలపాడు రోడ్డులోని గేదెల ఫారంకు పశువుల దాణా అందించేందుకు లోడ్‌తో వెళ్లాడు. ఆ సమయంలో ప్రశాంతినగర్ వద్ద 24వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు, అతని అనుచరులు ఆటోను నిలిపివేశారు. తాము వాణిజ్యపన్నుల శాఖ అధికారులమని, పశువుల దాణాకు సంబంధించి వేబిల్లులు బయటకు తీయాలని ఆటో డ్రైవర్‌ను బెదిరించారు. బిల్లులు లేవని చెప్పటంతో రూ.5 వేలు ఇవ్వాలని లేకుంటే ఆటో సీజ్ చేస్తామని బెదిరించారు. విషయాన్ని డ్రైవర్ యజమాని వేణుగోపాల్‌రెడ్డి సోదరుడు బ్రహ్మారెడ్డికి తెలియజేశాడు. అతను వచ్చి ఆరా తీయగా వాహనం నిలిపి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులు అధికారులు కాదని టీడీపీ నాయకులని తెలుసుకొని వారితో వాగ్వివాదానికి దిగారు. అయితే వచ్చింది తమ ప్రభుత్వమని కప్పం కడితేనే ఆటో విడిచిపెడతామంటూ బెదిరించారు. సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో టీడీపీ నాయకుడి అనుచర గణం పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని పోలీసుల చేతిలో ఉన్న లాఠీలను తీసుకొని ఆటో డ్రైవర్‌తోపాటు బ్రహ్మారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై టీడీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై శనివారం వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్‌ను వివరణ కోరగా గొడవ జరిగిన మాట వాస్తవమేనన్నారు. జరిగిన సంఘటనపై రెండు వర్గాల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న శివస్వామి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తాళ్లాయిపాలెం శివ స్వామి, దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీకి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

విత్తనాల కొరత...

అన్నదాతకు చింత



- వరిసాగుకు సమాయత్తమవుతున్న రైతులు
- జేజే రకం విత్తన సాగుకు రైతులు ఆసక్తి
- మార్కెట్లో అందుబాటులో లేని విత్తనాలు
- ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- జిల్లాలో 1.2 లక్షల ఎకరాల్లో వరి సాగు

నరసరావుపేట రూరల్: నాగార్జునసాగర్ నీటి మట్టం పూర్తిస్థాయికి చేరుతుండటంతో అన్నదాతల్లో ఆశలు మొలకెత్తాయి. కుడికాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి నారుమళ్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. విత్తనాల కొరత అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుంది. విత్తనాల కోసం పడిగాపులు పడుతున్నారు. వ్యవసాయ శాఖకు సరైన ప్రణాళిక లేకపోవడంతో విత్తనాలు దొరకని పరిస్థితి నెలకొంది.



విత్తనాల కోసం ఏపీ సీడ్స్ డీలర్ దుకాణం వద్ద వేచి ఉన్న రైతులు

వరి సాగుపై ఆశలు

జిల్లాలో గత నెలలో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 28మండలాల్లో 12 మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది. వరుణుడు కరుణించడంతో రైతులు మెట్టపైర్ల సాగును ప్రారంభించారు. పత్తి సాగును లక్ష ఎకరాల్లో చేపట్టగా, మిరప నారును సిద్ధం చేస్తున్నారు. సాగర్‌కు భారీగా నీరు వస్తుండటంతో మగాణి ప్రాంత రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. భారీ వర్షాలతో ఇప్పటికే పంట పొలాలు పదునెక్కాయి. దీంతోపాటు నాగార్జుసాగర్‌లో నీరు అందుబాటులో ఉండటంతో దుక్కులు దున్ని, నారుమడులను శుభ్రం చేస్తున్నారు. సాగర్‌లో నీరు లేకపోవడంతో గతేడాది వాగులు, బోర్ల మీద ఆధారపడి దాదాపు 25వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈఏడాది దాదాపు 1.2లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

విత్తనాల కొరత

వరి సాగుకు సిద్ధమైన రైతులను విత్తన కొరత వేధిస్తోంది. జిల్లాకు దాదాపు ఐదు వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం ఉంది. అందుకు తగ్గ విత్తనాలు మార్కెట్లో అందుబాటులో లేవు. రైతులు ఎక్కువగా సాగు చేసే విత్తనాలు కాకుండా ఇతర రకాలు ఉండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. నరసరావుపేట డివిజన్‌లోని రైతులు తెలంగాణకు చెందిన జేజే రకం విత్తనాలను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ విత్తనాలు మార్కెట్లో అందుబాటులో లేవు. ఈ విత్తనాల కోసం రైతులు దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విత్తన కొరతను దృష్టిలో ఉంచుకొని కొంత మంది వ్యాపారులు అధిక ధరకు వీటిని విక్రయిస్తున్నారు. నెల రోజుల క్రితం వరకు 30 కిలోల బస్తా రూ.1100 ఉండగా, నేడు దానిని రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న ఏపీ సీడ్స్ డీలర్ తెలంగాణ నుంచి జేజే రకం విత్తనాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. దీంతో ఈ దుకాణం వద్ద రైతులు పడికాపులు కాస్తున్నారు. రైతుల రద్దీ ఎక్కువ కావడంతో పోలీసుల బందోబస్తుతో విత్తనాలు విక్రయించాల్సి వస్తుంది.

అధిక ధరకు కొందామన్నా విత్తనం లేదు



జేజే రకం విత్తనం సాగు చేస్తే పెట్టుబడి తక్కువగా ఉండి అధిక దిగుబడి వస్తుంది. దీని వలన రైతుకు ఆదాయం వస్తుందని ఈ విత్తనం కోసం తిరుగుతున్నాం. ఇప్పటికే బస్తాకు రూ.500 ధర పెంచారు. ధర ఎక్కువైనా కొందామన్నా విత్తనం దొరకడం లేదు. అధికారులు ఈ విత్తనం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి.

–నాగూర్‌మీరా, చాగల్లు, నకరికల్లు మండలం

దుకాణాల చుట్టూ తిరుగుతున్నాం



విత్తనాల కోసం పట్టణంలోని అన్ని దుకాణాల చుట్టూ తిరుగుతున్నాం. జేజే రకం కావాలని ఎక్కడ అడిగినా అది లేదు వేరే రకం ఉంది అని చెబుతున్నారు. ఐదెకరాల్లో సాగు చేయాలని పొలాన్ని సిద్ధం చేశాం, ఇప్పుడు విత్తనం అందుబాటులో లేదు. సాగు ఎలా చేయాలో తెలియడం లేదు.

–వేల్పుల హరిబాబు, దాసరిపాలెం, రొంపిచర్ల మండలం

విత్తనాలు అందుబాటులో ఉన్నాయి



జిల్లాలో ఈ ఏడాది వెల్దుర్తి మినహా 27 మండలాల్లో వరి సాగు చేస్తున్నారు. లక్ష ఎకరాల్లో సాధారణ వరి సాగు కాగా దీనిని అధిగమించి 1.2లక్షల వరకు వరి సాగు అవుతుందని భావిస్తున్నాం. రైతులు వరి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. పలు రకాల విత్తనాల ఏపీ సీడ్స్ ద్వారా సబ్సిడీపై అందజేస్తున్నాం.

–ఐ.మురళి, జిల్లా వ్యవసాయాధికారి

విత్తనాల కోసం బారులు తీరుతున్న అన్నదాతలు



నకరికల్లులోని విత్తనాల దుకాణం వద్ద

నకరికల్లు: ఖరీఫ్ సీజన్ రావడంతో ధాన్యం విత్తనాల కోసం అన్నదాతలు పోటీ పడుతున్నారు. విత్తనాల దుకాణాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. స్థానిక చిన్నయ్య అండ్ సన్స్ విత్తనాల దుకాణం వద్దకు నకరికల్లు, చల్లగుండ్ల, చీమలమర్రి, దేచవరం, గుండ్లపల్లి తదితర గ్రామాల నుంచి శనివారం పెద్దసంఖ్యలో రైతులు చేరుకున్నారు. విత్తనాలు కొనుగోలు చేసేందుకు రసీదులు రాసేందుకు పోటీపడ్డారు. ప్రస్తుతం ఒకే ఒక దుకాణంలో విత్తనాల లభ్యత ఉండడంతో అందరూ ఒకేచోటకు చేరుకోవడం గందరగోళం నెలకొంది.

విత్తనాల ధాన్యం 25 కేజీల బస్తా రూ 1300లకు 30 కేజీల బస్తా రూ1500లకు విత్తనాల దుకాణంలో విక్రయిస్తున్నారు. శనివారం ఉదయం ఒక్కలోడు విత్తనాలు మాత్రమే రావడంతో వాటిని దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఇప్పటికే సీజన్ మించిపోతుండడంతో సకాలంలో విత్తనాలు దక్కకపోతే పంట సీజన్ మించిపోతుందని ఆందోళన పడుతూ తెల్లవారే సరికి దుకాణాలకు చేరుకుంటున్నారు. విత్తనాల కొరత లేకుండా నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ డిమాండ్‌కు అనుగుణంగా నివేదిక పంపామని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో పూర్తి వివరాలతో కూడిన బిల్లులు తీసుకోవాలని అన్నారు.

సరికొత్త ఆవిష్కరణలు

సామాజిక పరిష్కారాలు



మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థులు తయారుచేసిన కాంతి కాలుష్యానికి చెక్ చెప్పే ప్రయోగం

- జేఎన్‌వీ క్లస్టర్ స్థాయి పోటీల్లో సృజన వీచికలు
- 9 జిల్లాల నుంచి.. 57 నమూనాలు ప్రదర్శన
- సమాజంలో జరిగే పరిణామాలపై రూపొందిన ప్రాజెక్టులు
- ప్రాంతీయస్థాయి పోటీలకు 15 నమూనాలు ఎంపిక

యడ్లపాడు: విద్యార్థుల్ని భావి శాస్త్రవేత్తలుగా రూపొందించేందుకు నవోదయ విద్యాలయ సమితి ప్రతి ఏటా పాఠశాల నుంచి జాతీయ స్థాయి వరకు శాస్త్రీయ, వైజ్ఞానిక ప్రదర్శన పోటీలను నిర్వహిస్తోంది. విద్యార్థి దశలోనే మేధస్సుకు పదును పెడితే వారిలో జిజ్ఞాసను పెంచి వారి ఉజ్వల భవితకు బాట వేలయాలనే లక్ష్యంతో ఈ పోటీల్ని ఏర్పాటు చేస్తుంది. అలాగే వారిలోని సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా..పరిశోధన, ప్రయోగాల్లో మరింత రాణించేలా ప్రోత్సహిస్తోంది. పల్నాడు జిల్లాలోని మద్దిరాల నవోదయ విద్యాలయం ఇటీవల జరిగిన క్లస్టర్‌స్థాయి పోటీలకు వేదికైంది. రెండు రోజులు నిర్వహించిన ఈ పోటీల్లో 9 జిల్లాల నుంచి 57 మంది నవోదయ విద్యార్థులు తమ నమూనాలు ప్రదర్శించారు.

ఐదు అంశాలపై 57 ప్రాజెక్టుల రూపకల్పన

వ్యవసాయం, ఆరోగ్యం, రవాణా సమాచారం, పోటీతత్వ ఆలోచనలు విభాగాల్లో విద్యార్థులు సృజనకు పదునుపెట్టారు. నో కాస్ట్–నో వేస్ట్ థీమ్స్‌తో చిత్తు కాగితాలు, అట్టముక్కలు వారి చేతుల్లో అందమైన ఆకృతులుగా రూపుదిద్దుకున్నాయి. వాడేసిన పెయింటింగ్ బ్రష్‌లపై కళాత్మక చిత్రాలుగా జీవం పోసుకున్నాయి. పనికిరావని చెత్తలో పడేసినవి నిత్యావసర వస్తువులుగా తయారయ్యాయి. మట్టిముద్దలు అద్భుత విగ్రహాలుగా మారాయి. కల్తీలు లేని నాణ్యమైన ఆహార ఉత్పత్తి, గాలి, నీరు, భూమి, ఆకాశం ప్రకృతి పర్యావరణ ముప్పుకు గురికాకుండా పరిరక్షించుకునే ఆలోచన్లను ఆవిష్కరించాయి. హరిత వనాలతో ఒనగూరే ప్రయోజనాలు ప్రాజెక్టుల రూపంలో కొలువుదీరాయి. మట్టి లేకుండా భవనాలపై వివిధ రకాల మొక్కల పెంపక విధానం మార్గదర్శకంగా నిలిచింది. అంకుడు చెట్ల ప్రయోజనాలు, వాటి కొమ్మలతో ఆకర్షణీయమైన చెక్కబొమ్మలు, బెరడుతో ఎన్నో ఔషధాల తయారీ ఉపయోగించే అంశాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. వాననీటిని వృథా కాకుండా చూడటం..భూగర్భ జలాలను పెంపొందించకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కాంతి కాలుష్యం వల్ల జరిగే నష్టాలను నమూనాలై దర్శనమిచ్చాయి. మానవ శరీరంలోని భాగాలు, ఇంద్రీయాలు పనిచేసే తీరు..చక్కని ఆరోగ్యానికి పాటించాల్సిన సూత్రాలు..ఇలా రోజువారీ జీవన విధానంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు అవి చక్కటి పరిష్కారమార్గాలుగా నిలిచాయి.



రహదారి, జల, వాయు మార్గాలను చూపే నమూనా

వినూత్న నమూనాలు ప్రాంతీయ పోటీలకు అవకాశం

వినూత్న ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించి అందర్నీ అబ్బురపరిచారు. అధికారుల ప్రశంసలతోపాటు బహుమతుల్ని పొందారు. పోటీల్లోని ఐదు విభాగాల్లో ఒక్కొక్క దానిలో ముగ్గురు చొప్పున 15 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రాజెక్టులతో విజేతలుగా నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో బహుమతుల్ని అందుకున్నారు. త్వరలో కేరళ రాష్ట్రంలోని అలెప్పి నవోదయ విద్యాలయంలో జరిగే దక్షిణ భారతదేశస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో తమ నమూనాల్ని ప్రదర్శించే అవకాశాన్ని సాధించారు. వీటిలో మద్దిరాల నవోదయ విద్యాలయం విద్యార్థులు 5 విభాగాల్లో తమ నమూనాలను ప్రదర్శించి బహుమతులు పొందడం విశేషం. పలు జిల్లాలకు చెందిన జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన క్లస్టర్ స్థాయి పోటీ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వినూత్న నమూనాలు మీకోసం...

ఐక్యంగా జిల్లా అభివృద్ధికి కృషి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- కేంద్రం నుంచి పేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తాం
- గుంటూరు జెడ్పీలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం
- జెడ్పీ స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నిక



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, వేదికపై మంత్రి నాదెండ్ల మనోహర్, జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా ముందుకు వెళదామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని శనివారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్పీలోని ఏడు స్థాయీ సంఘాల్లో ఖాళీ అయిన సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన ముగ్గురు ఎంపీలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 17 మంది ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడారు. రాజకీయాలు ఎన్నికల్లో గెలుపోటములకే పరిమితం కావాలని, అధికారంలో ఉన్నప్పుడు కులమతాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా పేదలకు రెండు కోట్ల ఇళ్లను కేంద్రం మంజూరు చేయనుందని, ఇందులో మన రాష్ట్రానికి కనీసం 15 లక్షలు మంజూరు చేయించుకునేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గుంటూరు ఎంపీగా కేంద్రం నుంచి వివిధ పథకాల ద్వారా మరిన్ని నిధుల్ని తీసుకు వచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతానని పేర్కొన్నారు. గ్రామీణ సడక్, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్ వంటి పలు కేంద్ర పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణ, అమలులో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.


- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని తెలిపారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలకు తావు లేదని స్పష్టం చేశారు.
- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన మాచర్ల ప్రాంతానికి జెడ్పీ నుంచి నిధులు మంజూరులో తీవ్ర వివక్ష నెలకొంటోందని తెలిపారు. మాచర్లకు ఇప్పటి వరకు కేటాయించిన నిధుల వివరాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల్ని బహిరంగపరిస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయన్నారు.
- బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా, వినియోగదారులకు బియ్యం బదులు డబ్బులు ఇస్తున్న సంఘటనలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.
- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో పైపులైను నిర్మాణాల పేరుతో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేస్తున్నారని తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత రీతిలో చర్యలు చేపట్టాలని కోరారు.
- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అంతా కలిసి ప్రాంత అభివృద్ధికి పాటుపడదామని, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు తమతో కలిసి పని చేయాలని ఆయన కోరారు.

ఏడు సంఘాల్లో సభ్యులు ఏకగ్రీవ ఎన్నిక

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రణాళిక ఆర్థిక సంఘంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు నియమితులయ్యారు.

- గ్రామీణాభివృద్ధి సంఘంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్నికయ్యారు.
- వ్యవసాయ సంఘంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఉన్నారు.
- విద్య–వైద్యం సంఘంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు.
- మహిళా సంక్షేమ సంఘంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉన్నారు.
- సాంఘిక సంక్షేమ సంఘంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర నియమితులయ్యారు.
- పనులు–రవాణా సంఘంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎన్.వి.బి.ఎస్. వసంతరాయుడు, డెప్యూటీ సీఈవో జె.మోహనరావు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల వ్యవస్థ ప్రక్షాళన



రాష్ట్రంలో పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు నెలల్లో రూ.155 కోట్ల విలువైన 53వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. పార్టీలకతీతంగా కలిసి పనిచేసి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేద్దామని ఆయన చెప్పారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నిధులు మంజూరు చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన జెడ్పీ కార్యాలయ పరిపాలన భవనాన్ని నిర్మించడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేయాలని మంత్రి పెమ్మసానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో పలు మార్లు విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఇసుక సీనరేజీ, మైనింగ్, స్టాంప్ డ్యూటీకి సంబంధించి ప్రభుత్వం నుంచి జెడ్పీకి రావాల్సిన నిధులు విడుదల చేయాలని అప్పటి సీఎం వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లిన మీదట దానికి ఆయన అంగీకరించినప్పటికీ, ఆర్థికశాఖ అధికారులు నిలిపివేశారని తెలిపారు.

క్లుప్తంగా

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు సమగ్ర శిక్ష ఏపీసీ జి.వి జయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంఓ), ఎంఐఎస్ ప్లానింగ్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి(ఏఎస్ఓ) పోస్టులను ఒక్కోటి చొప్పున భర్తీ చేసేందుకు ఫారిన్ సర్వీసు రూల్స్‌కు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 55 ఏళ్ల లోపు వయసు గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో పీజీ విద్యార్హతతో గుర్తింపు పొందిన వర్సిటీ, విద్యాసంస్థల నుంచి కంప్యూటర్ పరిజ్ఞానంపై డిగ్రీ, డిప్లొమా కలిగి ఉండాలని తెలిపారు. సీఎంఓ పోస్టు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ పోస్టులకు ఎనిమిదేళ్లు, ఏఎస్ఓ పోస్టుకు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసి ఉండాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం లోగా డీఈఓ కార్యాలయంలోని సమగ్రశిక్ష జిల్లా విభాగంలో అందజేయాలని సూచించారు. విద్యార్హతలతో పాటు ఇతర ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలపై తాము పని చేస్తున్న పాఠశాల పరిధిలోని అధికారితో అటెస్టేషన్ చేయించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సమగ్రశిక్షగుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నగరంపాలెం: న్యాయవాదులపై తప్పుడు కేసులు నమోదుకు నిరసనగా ఈనెల 5న జిల్లాలోని న్యాయవాదులు విధులు బహిష్కరించనున్నట్లు జిల్లా(లాయర్స్) బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి తెలిపారు. గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జిల్లా(లాయర్స్) బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. న్యాయవాది జి.గవాస్కర్‌పై, గుంటూరులోని న్యాయవాది బి.నాగరాజుపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ క్రమంలో జిల్లాలోని న్యాయవాదులు విధులను బహిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యక్షులు పి.ప్రభాకర్ (తెనాలి), శ్రీనివాసరెడ్డి (గురజాల), సత్యప్రసాద్ (బాపట్ల), బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5300, మోడల్ ధర రూ.4600 వరకు పలికింది.

సీఎం సమీక్షకు నివేదికలు సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో ఈనెల 5న నిర్వహించనున్న జిల్లా కలెక్టర్ల సమావేశం నాటికి జిల్లాకు సంబంధించి అన్ని శాఖలు తమ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల సమగ్ర నివేదికలు అందచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం సమీక్ష సమావేశానికి అవసరమైన వివరాలను శాఖల వారీగా ఎలా పొందుపరచాలో దిశా నిర్దేశం చేశారు. సంక్షేమ, హౌసింగ్, వాటర్ రిసోర్సెస్, విద్యాశాఖ, ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ, మైనర్, మేజర్ ఇరిగేషన్, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం శాఖల వివరాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావల్సిన నిధులు, అనుమతులకు సంబంధించి జిల్లా అభివృద్ధికై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. హౌసింగ్ శాఖలో నిర్దేశిత లక్ష్యాలను గడువు లోపల ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలలో ప్రాధాన్యతాపరంగా మంచినీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా వంటి పనులు, మంచాలు, బెడ్‌షీట్ల కొనుగోలు చేయాలని సూచించారు. నాగార్జునసాగర్ నీటి నిల్వ, వర్షపాతం డేటా అందుబాటులో ఉంచాలన్నారు.
జిల్లా ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో వంటి వివరాలు పొందుపరచాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన పెండ్ర ముసలయ్య (ఫైల్)

పిడుగురాళ్ల: తాను చేయని నేరాన్ని చేసినట్లుగా పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయటంతో అవమానంగా భావించిన వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పెండ్ర ముసలయ్య (45), పెండ్ర నాగరాజు ఇద్దరిపై కొండమోడుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి పందులు దొంగలించారని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు విచారించేందుకు పెండ్ర ముసలయ్య, నాగరాజును పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. విచారణలో పెండ్ర ముసలయ్య, నాగరాజులు పందులు దొంగలించ లేదని, వెంకటేష్ తప్పుడు ఫిర్యాదు చేశాడంటూ పోలీసులు వెంకటేష్‌ను మందలించారు. కేసులకు సంబంధం లేని వ్యక్తులు ముసలయ్య, నాగరాజులను ఇంటికి పంపించారు. తాను చేయని తప్పుకు పోలీస్ స్టేషన్ వరకు తీసుకొని వెళ్లారని మనస్తాపానికి గురై పెండ్ర ముసలయ్య ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. బంధువులు మాత్రం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారనే అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని వాపోయారు. ఈ విషయమై పట్టణ సీఐ ఎస్. వెంకట్రావును వివరణ కోరగా కొండమోడుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి పెండ్ర నాగరాజు, ములసయ్యలపై ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. ముసలయ్య, నాగరాజులను పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చి విచారించటంతో వారిద్దరూ దొంగలించలేదని విచారణలో తెలిసిందనీ, వెంటనే వారిని ఇంటికి పంపించి తప్పుడు కేసు పెట్టిన వెంకటేష్‌కు వార్నింగ్ ఇచ్చి పంపించామన్నారు. ఇంటి వద్ద అతను అవమానంగా భావించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించామని, పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

బీజామృతంతో విత్తనశుద్ధి తప్పనిసరి

జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు


రైతులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు

ఫిరంగిపురం: మిరప పంటను వేసే రైతులు తప్పనిసరిగా బీజామృతంతో విత్తణశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని రేపూడి గ్రామ శివారులోని ప్రత్తి, మిరప పంటలను జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏవో వాసంతి శనివారం పరిశీలించారు. రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు మిరప పంటను వేసిన తరువాత ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని చెప్పారు. దానిలో భాగంగా ఘనజీవామృతం, ద్రవ జీవామృతాన్ని వాడాలన్నారు. ప్రత్తి పంటలో పచ్చదోమ, పేనుదోమను గుర్తించడం జరిగిందని వీటి నివారణకు ఐదుశాతం వేపగింజల కషాయాన్ని లేదా వంద మిల్లీలీటర్ల మోనోక్లోటోఫాస్‌ను నాలుగు వందల మిల్లీలీటర్ల నీటితో కలిపి బ్రష్‌తో కాండపై పూతలా పూయాలని చెప్పారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో పలు రికార్డులు పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఫిరంగిపురంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని మేనేజర్ రాధికను కలిసి కౌలు రైతులకు రుణాలు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్.పున్నారెడ్డి, టి.విశ్వనాథరెడ్డి, కిరణ్ కుమార్, శివారెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి షేక్. సుభానిలు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠ కోర్సు అడ్మిషన్ల ప్రతుల ఆవిష్కరణ


గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా 2024–25 ఏడాదికి సంబంధించి పదోతరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభ కరపత్రాలను, గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కల్గిన అభ్యర్థులు తమ దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల్లోని విద్యాపీఠ సెంటర్ల వివరాలు సమర్పించి అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఆన్‌లైన్ అడ్మిషన్లు జూలై 31వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయని, ఈనెల 27వ తేదీలోగా పూర్తి చేయాలని, అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించేందుకు 28వ తేదీవరకు గడువు ఉందన్నారు. సెప్టెంబరు నాల్గవ తేదీలోపు రూ.200ల అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ఫీజు చెల్లించవచ్చు అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా విద్యాశాఖాధికారి యం.వెంకటేశ్వర్లు, విద్యాపీఠం సమన్వయకర్త కె.ఎం.కె.హుస్సేన్, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు, జిల్లా ఆల్టర్నెట్ స్కూలు కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పట్నంబజారు: ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. గుంటూరు జిల్లాపరిధిలోని ఏపీఎస్ఆర్టీసీ హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌కు సంబంధించి శిక్షణ పూర్తి చేసుకున్న 15వ బ్యాచ్ డ్రైవర్లకు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్‌ఎం రవికాంత్ మాట్లాడుతూ డ్రైవర్లు మత్తు పానీయాలకు దూరంగా ఉంటూ, డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తి ప్రదర్శించాలని కోరారు. ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్‌లో ప్రతిరోజూ ఒక గంట వాహన భాగాల గురించి వివరించడంతో పాటు, రోడ్డు సిగ్నల్‌లు, ఇతర అంశాల గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఘాట్ రోడ్లలో ఎలాంటి భయం లేకుండా డ్రైవింగ్ చేసేలా శిక్షణ ఇచ్చామన్నారు. 15వ బ్యాచ్ ముగిసిన నేపథ్యంలో, 16వ బ్యాచ్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు– 1 డిపో మేనేజర్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

కొల్లూరు: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న అమెరికా భర్తపై భార్య ఫిర్యాదు చేసిన ఘటన ఇది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అనంతవరానికి చెందిన ధూళిపాళ్ల అనూజకు 2022లో హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన వడ్లపాటి మనీష్‌తో వివాహం జరిగింది. కొద్ది రోజుల తర్వాత భర్త, అత్త, మామ, ఇతర బంధువుల నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. పరిస్థితి సర్దుకుంటుందని భావించి భర్తతో ఆమె అమెరికా వెళ్లారు. అయినప్పటికీ వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి.

‘పీపుల్స్ కలెక్టర్ శివశంకర్’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, శివనాగిరెడ్డి, ప్రతినిధులు

నరసరావుపేట: పల్నాడు రోడ్డులోని కాసు వెంగళరెడ్డి భవనంలోని జిల్లాశాఖ గ్రంథాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిలు పీపుల్స్ కలెక్టర్ శివశంకర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా మొదటి కలెక్టర్‌గా శివశంకర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి, కళాక్షేత్ర అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్ఎస్ఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే మూర్తి, కాంగ్రెస్‌పార్టీ డీసీసీ అధ్యక్షుడు, న్యాయవాది గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్, ప్రముఖ రచయిత గంధం యాజ్ఞవాల్క్య శర్మ, సీమాంధ్ర డ్రగ్స్ అండ్ కెమిస్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు నరసరావుపేట కళావేదిక, పల్నాడు కళాక్షేత్రం, నెల నెలా సాహిత్య సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు సకాలంలో జీతాలు చెల్లించాలి

మండల గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు ఎల్.సిద్దయ్య


తహసీల్దారు కార్యాలయం ఎదుట జీతాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

రాజుపాలెం: గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు సకాలంలో జీతాలు అందించాలని మండల గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు ఎల్.సిద్దయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ముందు మండలంలోని వీఆర్‌ఏలు శనివారం అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమకు జీతాల బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదని, జీతాలు 10, 15వ తేదీలలో తీసుకుంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 1,2వ తేదీలలో తీసుకోవల్సిన జీతాలను అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ జీతాల బిల్లులు పెట్టడం లేదని వాపోయారు. జీతాలు ఆలస్యంగా వేస్తున్నారని తహసీల్దారు కార్యాలయంలో అడిగితే తమపట్ల చిన్నచూపు చూస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, అదేమని అడిగితే సర్వరు పనిచేయడం లేదని సాకులు చెబుతున్నారన్నారు. గట్టిగా జీతాలు అడిగితే అదనంగా డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పై అధికారులు వెంటనే స్పందించి తమ జీతాలను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజనల్ అధ్యక్షులు పి.సంజీవరావు, రాజు, యాకోబు, హుస్సేన్, సుభాని, విజయ్, అంజి, సీత, ఇశ్రాయేలు, కోటమ్మ, వెంకటప్పయ్య ఉన్నారు.

భ్రమర టౌన్‌షిప్ సమస్యలపై ఎంపీడీవోకు వినతి


ఎంపీడీవోతో మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

వినుకొండ: పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గల భ్రమర టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో నరసయ్యను టౌన్‌షిప్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు విన్నవించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ భ్రమర టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పి, లక్షలు ఖర్చు చేసి ఇల్లు కొన్నామని, నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎలాంటి సౌకర్యాలు కల్పించలేని వాపోయారు. దీనిపై యాజమాన్యాన్ని ప్రశ్నించగా, వారు కక్షపూరితంగా వాటర్ కనెక్షన్ కట్ చేశారని ఆరోపించారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవోని కలసిన వారిలో సొసైటీ అధ్యక్షురాలు ఎ.రజిని, సభ్యులు శేషగిరిరావు, బి.శ్రీనివాసరావు, పారా పద్మజారాణి, తదితరులు ఉన్నారు.

ఇళ్లపై దాడుల ఘటనలో పలువురిపై కేసు

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లపై టీడీపీ శ్రేణులు టీడీపీ శ్రేణులు చేసిన దాడులు ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. గ్రామంలో నెలకొనియున్న గొడవల నేపథ్యంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు గ్రామాన్ని విడిచి పొరుగు గ్రామాల్లో తలదాచుకుంటున్నారు. గ్రామానికి చెందిన చింతపల్లి షైదా భార్య సైదాబి ఇంట్లో ఉండగా టీడీపీకి చెందిన కొందరు ఇంటిపై దాడి చేసి ఇంటి గేట్లు, ఇంట్లోని సామాన్లు ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో కలియతిరిగి వైఎస్సార్ సీపీకి చెందిన మరికొంత మంది గృహాలపై దాడి చేసి ఇంటి ప్రహరీలు, అరుగులు, ఇళ్ల గేట్లు ధ్వంసం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి యువ రైతు బలి


హరిబాబు మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

రాజుపాలెం: యువ రైతు విద్యుదాఘాతమై మృతి చెందిన సంఘటన మండలంలోని అంచులవారిపాలెం గ్రామ సమీపంలోని పొలంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన నూకల హరిబాబు (25) మరొక రైతు, ప్రవేటు విద్యుత్ పనులు చేసే అతను ముగ్గురు కలసి పొలంలోని మోటర్‌కు విద్యుత్ తీగను బిగించేందుకు వెళ్లారు. ముందుగానే విద్యుత్ స్తంభానికి మోటరు తీగ కట్టించారు. ఈ లోగా ప్రవేటు ఎలక్ట్రిషన్ ఎల్‌సీ తీసుకునేందుకు విద్యుత్ అధికారులతో మాట్లాడుతుండగా ఆ సమయంలో ఇరువురు రైతులు లూజున్న వైరును గట్టిగా లాగగా పైఉన్న 33 కేబుల్‌కు తగలడంతోనూకల హరిబాబు షాకుకు గురై క్రింద పడిపోయాడు. వెంటనే హరిబాబును పిడుగురాళ్ల ప్రైవేటు వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. రెండవ అతనికి స్వల్ప గాయాలయ్యాయి. తల్లిదండ్రులు నూకల చిన్నబ్బాయి, నర్సమ్మలకు నలుగురు అమ్మాయిల తరువాత ఒక్కగానొక్క కుమారుడు. హరిబాబు మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య


దుర్గా భవాని మృతదేహం

కర్లపాలెం: పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో జరిగింది. కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన సూరగాని శ్రీనివాసరావుకు బాపట్ల మండలం ముత్తాయిపాలెంకు చెందిన దుర్గా భవానితో సుమారు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులు అప్పుడప్పుడు గొడవ పడే వారు. ఈ నేపథ్యంలో ఏట్రవారిపాలెంకు చెందిన గోపిరెడ్డితో తన భార్య చనువుగా ఉండేదని, అతడి వల్లే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పొలంలో ఉండగా గోపిరెడ్డి వచ్చి కొట్టటం వల్లే మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఉండొచ్చని భర్త ఆరోపించారు. శ్రీనివాసరావు అందుడు కాగా, వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ, గౌడ సంఘం, జై గౌడ ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి డీఎస్పీ మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబును కలిసి విన్నవించారు.